క్లుప్తంగా

పూర్వ విద్యార్థి రామకృష్ణకు సన్మానం



రామకృష్ణను సన్మానిస్తున్న ఏఆర్‌డీజీకే పాఠశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక ఆదివారపుపేట ఏఆర్‌డీజీకే పాఠశాల పూర్వవిద్యార్థి గొంతిన రామకృష్ణను ఆ పాఠశాల ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వి.క్రాంతి జయకుమార్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా రామకృష్ణ అంకితభావంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. తమ పాఠశాల పూర్వ విద్యార్థులందరినీ సమీకరించి ఇటీవల పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను వేడుకగా నిర్వహించడంలో రామకృష్ణ పాత్ర కీలకమని కొనియాడారు. నిధులు సేకరించి పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని ఎత్తు పెంచారని, వేదికను వెడల్పు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ ఓఆర్‌కే బాబురావు, ఏఆర్ లారెన్స్, తోట నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు మేడే స్ఫూర్తి


పోస్టర్‌ను విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కొత్తూరు జూట్ మిల్లు వద్ద ఇఫ్టూ రాష్ట్ర కమిటీ ప్రచురించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. అంతర్జాతీయ శ్రామిక దీక్షా దినోత్సవం 137వ మేడే కార్యక్రమాల్లో ప్రతి కార్మికుడు పాలు పంచుకోవాలన్నారు. కార్మిక వర్గం అనేక రక్త తర్పణల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ – అమిత్‌షాల ప్రభుత్వం రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలన్నారు. జూట్ పరిశ్రమను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కాకర్ల అప్పారావు, కొత్తూరుజూట్ మిల్లు యూనియన్ నాయకులు ఎస్ రంగారావు, వి.వెంకట్రావు, మురళి, బాలాజీ, భూషణం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- 96వ రోజు సుంకరవారితోటలో ప్రచారం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని


సుంకరవారితోటలో వృద్ధురాలికి అవసరమైనవన్నీ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ ఫలాల పండిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం శ్రమిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 96వ రోజు శుక్రవారం 6వ డివిజన్ సుంకరవారి తోటలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మెయిన్‌రోడ్డు నుంచి పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలను ఆప్యాయంగా పలుకరిస్తూ నెలనెలా పింఛన్ సక్రమంగా అందుతుందా లేదా ఆరా తీశారు. కొందరు వృద్ధులకు అండగా నిలవాలని, ప్రభుత్వం నుంచి ఏ విధంగా సహాయం కావాలన్నా తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా కల్పించారు. సాంకేతిక కారణంగా ఏదైనా పథకానికి దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాన్ని చేరువ చేయాలని అధికారులను నాని ఆదేశించారు. ఎమ్మెల్యే నానికి కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్ అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పేదల జీవన విధానంలో మార్పులు తీసుకురావాలని, తమ కుటుంబాలను పోషించుకుంటూ ప్రతి ఒక్కరూ ధీమాగా బతికేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చేందుకు ఎంతో శ్రమించారని వివరించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కుటుంబాలను పోషించుకునేందుకు సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. ప్రజల్లోకి ఎమ్మెల్యేలను పంపి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని నాని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, బండారు కిరణ్ కుమార్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, యర్రంశెట్టి సుమన్, పాలిమేర దాసు, దేవరకొండ శ్రీనివాస్, గరికిముక్కు జయకర్, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, పార్టీ నాయకులు మోటమర్రి సదానందం, కిలాడి దుర్గారావు, తోట సుధీర్, లూటుకుర్తి సుభాష్, నున్న కిషోర్, నిడికొండ నరేంద్ర, యల్లాపు మోజెస్, పిట్టా ధనుంజయ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, పీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ సోమశేఖర్, ఏలూరు రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో కమిషనర్ వెంకటకృష్ణ, డిప్యూటీ మేయర్ శ్రీనివాసరావు

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేదిలేదని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలపై అధికారులతో నాని సమీక్షించారు. 35, 43, 44 డివిజన్ల పరిధిలో సుమారు 180 అర్జీలు ప్రజలు ఇవ్వగా, వాటిలో ఇంకా 15 అర్జీలు మాత్రమే పరిష్కరించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఆయా డివిజన్ల పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు నిర్మాణాలకు సంబంధించి రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించాలన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటం, అభివృద్ధి పనులు చేయటమే తమ ప్రధాన ధ్యేయమని నాని స్పష్టం చేశారు. సమీక్షలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేటర్ పాలిమేర దాసు, జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి, జనపరెడ్డి కృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, పీఓ కృష్ణమూర్తి, పార్టీ నాయకులు బండారు కిరణ్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చెత్త సేకరణకు సహకరించండి


వన్‌టౌన్ ప్రాంతంలో చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్ : క్లీన్ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా తమకు సహకరించాలని కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ కోరారు. ఏలూరు కోటదిబ్బ ప్రాంత సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయానికి సిబ్బంది హాజరు సరిగా లేకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ మేస్త్రీ నిర్లక్ష్యంగా ఉండడంతో అతనిపై చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ఆదేశించారు. విధులకు గైర్హాజరయిన సిబ్బందికి నోటీసులు జారీ చేయాలన్నారు. అనంతరం డివిజన్‌లో చెత్తసేకరణ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి విడివిడిగా అందించాలని కోరారు. చెత్తను రీసైక్లింగ్ చేసి సేంద్రియ ఎరువుగా మార్చటం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించే అవకాశం ఉంటుందన్నారు. డ్రెయినేజీల్లో వ్యర్థాలు, చెత్త వేయకుండా ఇంటింటికీ వచ్చే పారిశుధ్య సిబ్బందికి చెత్తను ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ మాలతి, సిబ్బంది ఉన్నారు.

నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి లక్ష్మీగణపతి హోమం, వాస్తు హోమాలతో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ప్రారంభమౌతాయన్నారు. మధ్యాహ్నం నుంచి స్థానిక నృత్య కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని, సాయంత్రం 6 గంటల నుంచి అహ్మదాబాద్‌కు చెందిన గురు స్మితా శాస్త్రి శిష్యబృందం ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయ నృత్యాలు, కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తారని వివరించారు. గురు స్మితా శాస్త్రి, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతిలను, స్థానిక నృత్య గురువులు పార్వతీ రామచంద్రన్, పసుమర్తి శ్రీవల్లి, దువ్వి హేమసుందర్, గండికోట రాజేష్, యడ్ల సూర్యకుమారి, నీలి శర్వాణి, సీహెచ్ లక్ష్మీ కుమారి, బలిజేపల్లి అక్షయ సుధలను సత్కరిస్తామని తెలిపారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలి


విద్యార్థులతో బిషప్ జాన్ ఎస్‌డీ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఐసీఎం విద్యా సంస్థల విద్యార్థులు అంకితభావంతో శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఐసీఎం సంఘాల అగ్రపీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డీ రాజు పిలుపునిచ్చారు. ఐసీఎం సంస్థ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తోన్న వివిధ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. స్థానిక 18, 29, 38, 50వ డివిజన్లలోని పాఠశాలలను సందర్శించి అక్కడి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిషప్ జాన్ ఎస్‌డీ రాజు మాట్లాడుతూ సమాజంలోని పేదలకు విద్యను అందించి, వారిని అభివృద్ధి పథంలో నడపాలనే లక్ష్యంతో దాదాపు ఏడు దశాబ్దాలుగా విద్యా సంస్థలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తమ సంస్థకు చెందిన ఆయా పాఠశాలలను, స్థిర, చర ఆస్తులతో సహా ప్రభుత్వానికి అప్పగించేందుకు ఐసీఎం చర్చ్ ట్రస్ట్ బోర్డు తీర్మానించిందని వివరించారు. ఆయన వెంట ఐసీఎం పాఠశాలల కరస్పాండెంట్ ఆర్ డేవిడ్, ఆయా పాఠశాలల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు


శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): కంప్యూటర్ కోర్సుల్లో నైపుణ్యం పెంపొందించుకోవటం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకునే వీలు ఉంటుందని నీటిపారుదల శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 20వ బ్యాచ్‌కి శుక్రవారం సర్టిఫికెట్లను అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు, నిరుద్యోగ యువత ఐదు రకాల కోర్సుల్లో నైపుణ్యం సాధించడం అభినందనీయమన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఏవీఆరా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ వై.అర్జునరావు, హేలాపురి బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ పి.కస్తూరి బాయి, శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.పూర్ణచంద్, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎస్ రవి, డి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏలూరు టూటౌన్ సంతోష్‌నగర్‌కు చెందిన వ్యక్తి చిరు వ్యాపారి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్రంపాడులో ఫాస్ట్‌ఫుడ్ బండి నిర్వహించే ఆకుల కిరణ్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై రెండు రోజుల క్రితం నిద్రమాత్రలు మింగాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడ్ని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఆత్మహత్యకు పాల్పడకూడదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలోని సైక్రియాటిస్ట్ డాక్టర్ కోమలి తెలిపారు. ప్రజల మానసిక సమస్యల పరిష్కారానికి ×టెలీమానస్ టోల్‌ఫ్రీ నెంబర్ 14416×లో సంప్రదించాలని సూచించారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆత్మహత్యలకు ప్రేరేపితులు కావద్దని సూచించారు.

1 నుంచి శ్రీవారి కల్యాణ మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పడమర వీధి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మే 1వ తేదీ నుంచి శ్రీవారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ.రవి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ ఉదయం అంకురార్పణ, వాస్తు పూజ, హోమాలు, ధ్వజారోహణ, 2, 3 తేదీల్లో ఉదయం, సాయంత్రం నిత్య హోమాలు, బలిహరణ 4న ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుని, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేస్తారని, రాత్రి 7 గంటల నుంచి స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5న ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, 6న రాత్రి అద్దాల మహల్‌లో స్వామి పవళింపు సేవ, 7న మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని వివరించారు.

మన్‌కీ బాత్‌ను ప్రతి ఒక్కరూ వీక్షించాలి

ఏలూరు (టూటౌన్): ప్రతి నెలా చివరి ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ మనసులో మాట (మన్‌కీ బాత్) ప్రసార మవుతోందని, ఈనెల 30న ప్రసారమయ్యే వందో ఎపిసోడ్‌ను ప్రతి ఒక్కరూ వీక్షించాలని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడే కొర్ల సుధాకర్ కృష్ణ కోరారు. ఆదివారం ఉదయం 11 నుంచి 11.30 గంటలకు హిందీలో, 11.30 గంటల నుంచి 12 గంటల వరకు తెలుగులో ప్రచారమవుతుందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా దేశ పరిస్థితులు, సాంస్కృతి సంప్రదాయాలు, దేశంలో వివిధ రంగాల్లో అభివృద్ధి, స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు, టెక్నాలజీ గురించి ప్రధాని వివరిస్తారని తెలిపారు.

చెంచుకాలనీ వాసుల వినతి

ఏలూరు రూరల్: ఏలూరు ఇందిరాకాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ చెంచు కాలనీ సంఘం పెద్దలు శుక్రవారం ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానిని కోరారు. గిరిజన చెంచు సంఘం అధ్యక్షుడు సింహాద్రి మురళీకృష్ణ, కార్యదర్శి గేదెల రవికుమార్ నాని కలిసి వినతిపత్రం అందించారు. సుంకరతోట చివర నుంచి దుర్గమ్మ ఆలయం వరకు రోడ్డు గోతులమయం కావడం వల్ల ఆటో ప్రయాణం నరకప్రాయంగా ఉందని, రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి కాకపోవడంతో రోడ్డు, పల్లపు ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోతోందని తెలిపారు. వీధిలైట్లు లేక రాత్రి వేళ మహిళలు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. సురక్షిత తాగునీరు అందడం లేదని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

పెదవేగి : ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చేందుకు ప్రభుత్వ ఉద్యోగులు కృషి చేయాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. పెదవేగి మండలం పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో వివిధ సంక్షేమ పథకాలపై ఎంపీడీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాపవుట్స్‌ను గుర్తించి బడిలో చేర్పించేలా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్యను పెంచాలని, 29వ తేదీన అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	14	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	40
కాకర కాయలు	40-44	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	40	అల్లం	130
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	16	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	14	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	27
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

వేగంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు


చాటపర్రు జగనన్నకాలనీలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వేగంగా ఇళ్లు నిర్మించాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఏలూరు మండలం చాటపర్రు జగనన్నకాలనీ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి విద్యుత్ లైన్లు ఏర్పాటుచేసిందన్నారు. కాలనీ ప్రధాన రోడ్డు ముందు జగనన్నకాలనీ తోరణం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం రూ.4.25 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ తంబి తదితరులు ఉన్నారు.

తెల్లదోమతో ఉద్యాన పంటలకు నష్టం

పెదవేగి : పామాయిల్, కొబ్బరి తోటల రైతులకు సర్పిలాకార తెల్లదోమ ఎక్కువ నష్టం కలిగిస్తుందని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఎం. తిరుపతిరెడ్డి తెలిపారు. పెదవేగి మండలం విజయరాయిలోని మొక్కజొన్న పరిశోధన కేంద్రం వద్ద దెందులూరు నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి సర్పిలాకార తెల్లదోమ నివారణ చర్యలపై శుక్రవారం శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లదోమ మొక్కల ఆకుల కింద భాగాలను ఆశించి రసాన్ని పీల్చడంతో ఆ రసం మొక్కలపై పడి సూర్యకిరణాల వల్ల ఆకులపై మసి పొరలుగా ఏర్పడి ఎదుగుదల క్షీణిస్తుందన్నారు. తెల్లదోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందులపై అవగాహన కల్పించారు. రైతులందరూ ఈ నివారణ చర్యలు సామూహికంగా చేపడితే సత్ఫలితాలు వస్తాయన్నారు. గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని ఆయన ఆర్‌బీకే సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. రవికుమార్, పెదవేగి మండల ఉద్యానాధికారి ఎం.రత్నమాల, పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు, ముసునూరు మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి

పెదపాడు: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని జాయింట్ కలెక్టరు బీ లావణ్యవేణి అన్నారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్ల్స్ ఛాంపియన్స్ ఇన్ స్పోర్ట్స్‌గా గుర్తించిన 13 మంది బాలికలకు కలెక్టరు ఆదేశాల మేరకు సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లావణ్యవేణి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. దీనివల్ల శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ ఎండీ మెహరాజ్, జీసీడీవో సబితా సుల్తాన్, ఏసీడీపీఓ లలిత, కోఆర్డినేటర్ పీ వాసవి, డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి, పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

కొప్పాక హెడ్ మాస్టర్ సస్పెన్షన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని పెదవేగి మండలం కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ ప్రసన్నాంజనేయులును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసన్నాంజనేయులు పాఠశాలలోని ఉపాధ్యాయినిలతో అమర్యాదకరంగా ప్రవర్తించడం, మానసికంగా హింసించడం, ఎంఈఓ ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా విద్యాశాఖాధికారితో తన సెలవు విషయం తెలపడం, సెలవు అనంతరం నేరుగా విధుల్లో చేరడం, విద్యార్థులతో సొంత పనులు చేయించుకోవడం వంటి ఆరోపణలపై చేసిన విచారణ నివేదిక జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవి సాగర్ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు సమర్పించారు. ఈ మేరకు ప్రసన్నాంజనేయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దేశీయ చదువు.. విదేశీ శిక్షణ



ఐసీఏఆర్ ద్వారా విదేశాలకు వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు

- బాపట్ల అగ్రిఇంజనీరింగ్ కళాశాల నుంచి 8 మంది ఎంపిక
- అమెరికా, మలేషియా, ఫిన్లాండ్ తదితర దేశాలకు విద్యార్థులు
- ప్రతిభను పెంపొందించడం, అడ్వాన్స్‌డ్ మెషినరీ పరిశీలన కోసం ఐడీపీ శిక్షణ

సాక్షి ప్రతినిధి, బాపట్ల

బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులను ఆధునిక, సాంకేతిక నైపుణ్యం సాధించేలా కళాశాల ప్రోత్సహిస్తోంది. సాంకేతిక అంశాలపై శిక్షణ కోసం వారిని విదేశాల్లోని యూనివర్సిటీలకు పంపిస్తోంది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తుండగా.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రి కల్చరల్ రీసెర్చ్, ఢిల్లీ (ఐసీఏఆర్) ఆర్థిక సాయం అందజేస్తోంది. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి వారిని శిక్షణకు ఎంపిక చేస్తోంది. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇటీవల 8 మంది విద్యార్థులను ఐసీఏఆర్–ఐడీపీ ప్రోగ్రాం కింద శిక్షణ నిమిత్తం విదేశాలకు పంపింది. వారు రెండు నెలల పాటు శిక్షణ ముగించుకుని ఇటీవల కళాశాలకు చేరుకున్నారు. నాలుగేళ్లుగా ఏటా ఐడీపీ ప్రోగ్రాం కింద ఐసీఏఆర్ విద్యార్థులను ఎంపిక చేస్తోంది.

నూతన విధానాలపై అధ్యయనం

విదేశీ వర్సిటీల్లో శిక్షణ ఇప్పించటం ద్వారా విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించడం, ఆయా దేశాల్లోని వ్యవసాయ ఆధారిత వనరులపై అధ్యయనం చేయటం, వ్యవసాయానికి సంబంధించి అత్యాధునిక పరికరాలపై అక్కడి వారితో కలిసి పరిశోధనలు చేయటం లాంటి కార్యక్రమాల్లో మన విద్యార్థులు శిక్షణ పొందారు. యూఎస్ఏలోని కాన్సెస్ స్టేట్ యూనివర్సిటీకి ముగ్గురు విద్యార్థులు, ఫిన్లాండ్‌లోని టంపరే యూనివర్సిటీకి ఇద్దరు, యూనివర్సిటీ ఆఫ్ మలేషియాకు ముగ్గురు చొప్పున మొత్తం 8 మంది విద్యార్థులతోపాటు కళాశాల అధ్యాపకులు సైతం శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా ఫుడ్‌గ్రెయిన్ ప్రాసెసింగ్, థాయ్‌లాండ్ వాటర్ కన్జర్వేషన్, ఫామ్ మెకనైజేషన్, డ్రోన్ ఆపరేటింగ్, చిరుధాన్యాల ప్రాసెసింగ్, యాంత్రీకరణ పరికరాలను ఉపయోగించే విధానం తదితర అంశాలపై విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. నాణ్యమైన బ్రెడ్, పిజ్జా లాంటి తినుబండరాలు తయారుచేయటం, కూరగాయలను భద్రపరిచే విధానం, గార్డెన్స్ రూపొందించడం తదితర వాటిపై శిక్షణ తీసుకున్నారు. అక్కడి పరిశ్రమలను పరిశీలించడంతోపాటు వ్యాపారులతో చర్చించినట్టు విద్యార్థులు తెలిపారు.

శిక్షణ మంచి బాటలు వేసింది



అమెరికాలోని కాన్సెస్ స్టేట్ యూనివర్సిటీకి శిక్షణ కోసం వెళ్లా. ఫుడ్‌గ్రెయిన్ ప్రాసెసింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఇలాంటి శిక్షణ తరగతులు మా భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడతాయి.

– సాయిశ్రీ, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని

చిరుధాన్యాల ప్రాసెసింగ్‌పై శిక్షణ



అమెరికాలోని కాన్సెస్ స్టేట్ యూనివర్సిటీకి రెండు నెలల శిక్షణ కోసం వెళ్లా. చిరుధాన్యాల ప్రాసెసింగ్‌లో శిక్షణ తీసుకున్నాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన మెషినరీపై అధ్యయనం చేశాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి

స్మార్ట్ అగ్రికల్చరల్ టెక్నాలజీపై శిక్షణ పొందా



ఫిన్లాండ్‌లోని టంపరే యూనివర్సిటీలో స్మార్ట్ అగ్రికల్చరల్ టెక్నాలజీపై శిక్షణ తీసుకున్నాను. వ్యాపారులతో చర్చించి చాలా విషయాలను నేర్చుకున్నాం. డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ తీసుకున్నాం.

– సోఫియా, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని

విదేశీ శిక్షణ ఎంతో ఉపయోగకరం



8 మంది విద్యార్థులను శిక్షణ నిమిత్తం అమెరికా, మలేషియా, ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీలకు పంపించా. వారు ఎంపిక చేసుకున్న సబ్జెక్టుల్లో అక్కడ శిక్షణ పొందారు. ఐసీఏఆర్ ద్వారా పొందిన ఐడీపీ శిక్షణ విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుంది.

– దానియల్‌రాజ్, ప్రిన్సిపాల్, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల

తెలంగాణ

ఎంసెట్‌కు దరఖాస్తుల వెల్లువ

రెండు విభాగాలకు కలిపి 3,20,310 అప్లికేషన్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌కు ఈసారి భారీగా దరఖాస్తులొచ్చాయి. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మెడికల్‌లోనూ ఇదే ట్రెండ్ కన్పిస్తోంది. ఇప్పటి వరకు రెండు విభాగాలకు కలిపి 3,20,310 అప్లికేషన్లు అందాయి. ఇందులో తెలంగాణకు చెందినవి 2,48,146, ఏపీవి 72,164 ఉన్నాయి. గత సంవత్సరం (2022) మొత్తం 2,66,714 దరఖాస్తులే రావడం గమనార్హం. కాగా ఈ ఏడాది అనూహ్యంగా 53,224 దరఖాస్తులు (20%) పెరగడంతో ఆ మేరకు పరీక్ష కేంద్రాల పెంపుపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. దేశ వ్యాప్తంగా 2019 చివరలో కోవిడ్ విజృంభించడం, రెండేళ్ళ పాటు విద్యా సంస్థలు సరిగా నడవకపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2021లో టెన్త్ వార్షిక పరీక్షలు నిర్వహించకుండా అందరినీ పాస్ చేశారు. ఎప్పటిలాగే పరీక్షలు జరిగితే 20 శాతం వడపోత అక్కడే జరిగేది. కానీ పరీక్షలు లేకపోవడంతో విద్యార్థులు చాలావరకు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు తీసుకున్నారు. వీళ్ళే ఇంటర్ పూర్తి చేసుకుని ఇప్పుడు ఎంసెట్ రాస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎంసెట్ దరఖాస్తులు పెరగడానికి 'అంతా పాస్' దోహదపడింది. ఎంసెట్ దరఖాస్తులు అనూహ్యంగా పెరగడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు ప్రాంతాల్లోనూ పరీక్ష కేంద్రాలు పెంచాలనే ఆలోచనతో ఉన్నామని జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి తెలిపారు.

అజారుద్దీన్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అజారుద్దీన్‌కు హైకోర్టు ఫామ్ –1 నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే లీగ్ మ్యాచుల్లో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను అనుమతించాలని హైకోర్టు 2021లో ఆదేశాలిచ్చింది. అయినా కోర్టు ఆదేశాలను హెచ్‌సీఏ అమలు చేయకపోవడంతో నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఉద్దేశ పూర్వకంగానే కోర్టు ఆదేశాలను పాటించడం లేదని పేర్కొంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అజారుద్దీన్‌కు నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 23కు వాయిదా వేశారు.

కుక్కకాటుతో ఒకరి మృతి



మహబూబాబాద్ రూరల్: కుక్కకాటుతో ఒక వ్యక్తి మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం దర్గా తండాలో సుతారి కూలీ ధరావత్ సోమ్లా (42)ను ఈ నెల 24వ తేదీన కుక్క కరవడంతో మర్నాడు వ్యాక్సిన్ వేసుకున్నాడు. గురువారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ బి.రాంచరణ్ తెలిపారు.

జూన్ 5లోగా స్టేటస్ రిపోర్టు సమర్పించండి

టీఎస్‌పీఎస్సీ కేసులో సిట్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ సంతృప్తికరంగానే ఉన్నా.. నత్తనడకన సాగుతోందని హైకోర్టు అభిప్రాయపడింది. నెలన్నర గడిచినా నిందితుల వాంగ్మూలం నమోదు చేయడం తప్ప.. ఎలాంటి ఫలితాన్ని రాబట్టలేదని పేర్కొంది. ప్రస్తుతానికి ఈ కేసులో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. దర్యాప్తు పూర్తి చేయడానికి ఇంకా ఎంత సమయం కావాలని సిట్‌ను ప్రశ్నించింది. జూన్ 5 లోగా స్టేటస్ రిపోర్టు అందజేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. పేపర్ లీకేజీ కేసును సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయలేదని, సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో పాటు మరో ఇద్దరు నిరుద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సిట్ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు.

కట్టుకున్న భార్యను కిరాతకంగా కడతేర్చాడు..

- ఆపై తానూ ఆత్మహత్య
- పశ్చిమగోదావరి జిల్లాలో దారుణం



గంజి నిర్మల(ఫైల్)



రవి

తాడేపల్లిగూడెం రూరల్: కట్టుకున్న భార్యను అత్యంత కిరాతకంగా నరికి చంపిన దారుణ ఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గంజి నిర్మల(32), రవి(35)లకు 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి పదమూడేళ్ల ఆకాష్, పదకొండేళ్ల అలేఖ్య, తొమ్మిదేళ్ల అమృత పిల్లలు. మద్యానికి బానిసైన రవి తరచూ నిర్మలను కొడుతూ వేధిస్తుండేవాడు. దీంతో పిల్లల్ని కొయ్యలగూడెంలోని అనాథాశ్రమంలో చేర్పించారు. ఆ తర్వాత నిర్మల ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లిపోయింది. ఆమె పంపిన సొమ్ముతో రవి జల్సాలు చేస్తుండేవాడు. డబ్బు కోసం కొంతకాలం కిందట పిల్లల్ని చంపేస్తానంటూ కత్తితో బెదిరిస్తున్న వీడియోను కువైట్‌లో ఉన్న భార్యకు పంపాడు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో అతన్ని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల రవి జైలు నుంచి విడుదలయ్యాడు. ఇదిలా ఉండగా నిర్మల ఆరు నెలల కిందట పిల్లల్ని చూసేందుకు కువైట్ నుంచి కొమ్ముగూడెంలోని తన చెల్లెలి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో రవి తాను మారిపోయానని పెద్దల సమక్షంలో చెప్పి వారం కిందట భార్య నిర్మలను వీరంపాలెంలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. శుక్రవారం తెల్లవారు జామున 3.30 గంటల ప్రాంతంలో నిద్ర మత్తులో ఉన్న నిర్మలపై భర్త ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. నోటిలో గుడ్డలు కుక్కి.. అత్యంత కిరాతకంగా కత్తితో నరికి చంపాడు. స్థానికుల సమాచారం మేరకు రూరల్ ఎస్‌ఐ వీరభద్రరావు, భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, రూరల్ సీఐ మూర్తి ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరి బంకపల్లి చెల్లాలు ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేశారు.

భార్యను హత్య చేసిన అనంతరం రవి అక్కడ నుంచి సమీపంలోని పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతను అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రవిని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు రూరల్ సీఐ మూర్తి చెప్పారు. వీరిద్దరి మృతితో కొయ్యలగూడెంలోని అనాథాశ్రమంలో ఉంటున్న చిన్నారులు అనాథలుగానే మిగిలిపోయారు.

తేనెటీగల దాడిలో ఒకరి మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు



మోహనప్ప(ఫైల్)

బైరెడ్డిపల్లె (చిత్తూరు జిల్లా): పెద్ద తేనె టీగల దాడిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. జాలారిపల్లె సమీపంలోని శ్మశాన వాటికలోని ముళ్ల పొదలను జేసీబీ సాయంతో శుక్రవారం తొలగించారు. పనులు చూడ్డానికి వెళ్లిన జాలారిపల్లె మోహనప్ప, రెడ్డెప్ప, వెంకటరమణ, కమ్మనపల్లె రెడ్డెప్పపై పక్కనే చింతచెట్టుకు ఉన్న పెద్ద తేనెటీగలు దాడి చేశాయి. మోహనప్ప(51) అక్కడిక్కడే కుప్పకూలి మృతిచెందాడు. రెడ్డెప్ప, వెంకటరమణ, కమ్మనపల్లె రెడ్డెప్పకు తీవ్ర గాయాలు కావడంతో బైరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

స్థానిక వార్తలు

'తిరుమల'లో రేపు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని తిరుమల విద్యా సంస్థల ఆవరణలో 6, 7, 8, 9, 10 తరగతుల్లో చేరే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ, ఎన్ఐటీతో పాటు వైద్య కళాశాలల్లో ప్రవేశ పరీక్షలపై ఆదివారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. విద్యార్థి దశలో పిల్లలు నేర్చుకోవాల్సిన విషయాలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్, వైద్య, విద్య కోసం సన్నద్ధమవ్వాల్సిన పరీక్షలు, కళాశాలలపై తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

ఉగ్రంతో మంచి అనుభూతి

చిత్ర హీరో అల్లరి నరేష్ వెల్లడి



మాట్లాడుతున్న 'ఉగ్రం' చిత్ర హీరో అల్లరి నరేష్. పక్కన హీరోయిన్ మిర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తాను హీరోగా నటించిన 'ఉగ్రం' సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుందని ఆ చిత్ర హీరో అల్లరి నరేష్ తెలిపారు. శుక్రవారం ఏలూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఉగ్రం' సినిమా తన 60వ చిత్రంగా వస్తోందని చెప్పారు. గతంలో తాను చేసిన కామెడీ చిత్రాలకు భిన్నంగా ఇటీవల యాక్షన్ ఓరియంటెడ్ చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకోవడం నటుడిగా తనకు సంతృప్తినిస్తోందన్నారు. లాక్‌డౌన్‌కు ముందు తాను నటించిన 'నాంది' సినిమా ప్రేక్షకులను మెప్పించిందని, అప్పటి నుంచి తాను కామెడీ సినిమాలకు పరిమితం కాకుండా విభిన్న పాత్రలు పోషించాలనే లక్ష్యంతో కథలను ఎంచుకుంటున్నానని వివరించారు. 'ఉగ్రం' సినిమాను చిత్ర యూనిట్ ఎంతో కసితో రూపొందించిందని, ఇది తప్పకుండా ప్రేక్షకుల ఆదరణ పొంది పెద్ద హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం కలిగిందని తెలిపారు. ప్రతీరోజూ సమాజంలో ఎంతోమంది తప్పిపోతున్నారని, వారిలో సగం మంది జాడ కూడా కనిపెట్టలేని పరిస్థితి ఉందని, లాక్‌డౌన్ సమయంలో ఎవరూ బయటకు వచ్చే పరిస్థితి లేని సమయంలో కూడా దాదాపు లక్షా 50 వేల మంది తప్పిపోయారని, దానినే తమ కథాంశంగా తీసుకుని ఈ చిత్రాన్ని డైరెక్టర్ విజయ్ కనకమేడల ఆసక్తికరంగా చిత్రించారని నరేష్ వివరించారు. హీరోయిన్ మిర్నా మాట్లాడుతూ తెలుగులో 'ఉగ్రం' తనకు రెండో చిత్రమని, తాను నటించిన తొలి తెలుగు చిత్రం 'క్రేజీ ఫెలో'కు తెలుగు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించిందని చెప్పారు. 'ఉగ్రం' సినిమాలో తనకు నటనకు ఆస్కారమున్న పాత్ర లభించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ప్రేక్షకులను మరింతగా మెప్పించడానికి కృషి చేస్తానన్నారు. సపోర్టింగ్ యాక్టర్ సాయి మాట్లాడుతూ ఈ చిత్రానికి సంబంధించిన టీజర్, ట్రైలర్ ఇటీవల విడుదలై అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభించాయని చెప్పారు. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు సరికొత్తగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఆలోచింపజేసిన 'వెండి అంచులు'



'వెండి అంచులు' నాటికలోని ఓ దృశ్యం

సాక్షి, భీమవరం: స్త్రీల పునరుత్పత్తి హక్కుపై కూడా పురుషుల ఆధిపత్యమా.. ఇంతకంటే అమానవీయత ఏముంటుందని ప్రశ్నిస్తూ సాగిన 'వెండి అంచులు' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. భీమవరం పట్టణంలో చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ 16వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీల్లో భాగంగా డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కళావేదికపై శుక్రవారం దీనిని మొదటి నాటికగా ప్రదర్శించారు. అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారు దీనిని రూపొందించగా, గంగోత్రిసాయి దీనికి దర్శకత్వం వహించారు. ఈ పోటీల్లో శుక్రవారం ప్రదర్శించిన నాటికలన్నీ సందేశాత్మకంగా సాగాయి. రెండోదిగా కొప్పోలు పండు క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు' నాటికను ప్రదర్శించారు. ఇతరుల అవసరాలను అవకాశంగా తీసుకుని ఎదుటివారిని బ్లాక్‌మెయిల్ చేయడం తప్పనే ఇతివృత్తంతో ఈ నాటిక సాగుతుంది. దీనికి బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించగా.. ఎం.హరనాథబాబు, దేవసేన, సురభి లలిత, ఉన్నం వెంకట శేషయ్య, ఎం.శ్రీరామమూర్తి అద్భుత నటనతో ఆకట్టుకున్నారు. మూడో ప్రదర్శన 'మృత్యుపత్రం'లో అమాయక ప్రజలను ప్రభుత్వాసుపత్రిలో ఏవిధంగా మోసం చేస్తున్నదీ కళ్లకు కట్టినట్టు చూపించారు. చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ వారు దీనిని రూపొందించారు. వై.భవాని దీనికి దర్శకత్వం వహించారు.

వలంటీర్ల నియామకానికి అర్జీల ఆహ్వానం

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో నెహ్రూ యువకేంద్రం వలంటీర్ల నియామకం చేపట్టనున్నామని ఉమ్మడి జిల్లా యువ అధికారి డి.కిషోర్ శుక్రవారం తెలిపారు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 99495 45815, 08812–230860 నంబర్లలో సంప్రదించాలని కోరారు.